

**జోరుగా.. హుషారుగా..**
జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన బర్డ్ వాక్ జోరుగా.. హుషారుగా సాగింది. వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులను పక్షి ప్రేమికులు తమ కెమెరాలతో ఫొటోలు తీశారు. 8లో▸



**గాంధారి ఖిల్లాలో భక్తుల సందడి**
గాంధారి ఖిల్లా ప్రాంతంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. మైసమ్మ జాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /14.0

**వాతావరణం**
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

## న్యూస్‌రీల్

### పదోన్నతులు, బదిలీ ప్రక్రియ పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

**మంచిర్యాలఅర్బన్:** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య, పదోన్నతుల సీనియార్టీ, బదిలీల జాబితాలు, మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు వివరించారు. రోజువారీగా షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న పనులు తెలిపారు. మొదటిసారిగా డీఈవో కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌ను శాలువాలతో సత్కరించారు. డీఈవో కార్యాలయ పర్యవేక్షకులు సత్యనారాయణ, ఏపీవో విజయ్, బదిలీల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### భాషాపండితుల నిరసన



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

**మంచిర్యాలఅర్బన్:** పండిత, పీఈటీ జేఏసీ పిలుపు మేరకు శనివారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. 9, 10వ తరగతుల బోధన యధావిధిగా నిలిపివేశారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల్లో భాషా పండితులకు మొండి చేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, రాజావేణు, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పత్తి సత్తయ్య, బన్న రవీందర్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, తపస్ జిల్లా బాధ్యులు నీలేష్, భాషా పండితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తరగతుల బహిష్కరణ**
**కోటపల్లి:** భాషోపాధ్యాయులకు పదోన్నతి కల్పించకపోవడాన్ని నిరసిస్తూ 9, 10వ తరగతుల శనివారం కొనసాగించారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో పలు పాఠశాలలను సందర్శించి భాషోపాధ్యాయులు కలిసి వారి సమస్యలు తెలుసుకుని బహిష్కరణ కార్యక్రమం అమలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వేదాంతం విశ్వప్రసాద్, శ్రీధర్, స్వామి, సురేందర్, శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

**పదోన్నతులు కల్పించాలి**
**భీమారం:** భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతుల బోధన బహిష్కరించిన ఉపాధ్యాయులకు ఆయన మద్దతు తెలిపారు. అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. భాషాపండితులు వేణుగోపాల్‌రావు, జలజ, లక్ష్మి, పీఈటీ విఠల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 108లో ఉద్యోగ అవకాశాలు

**మంచిర్యాలటౌన్:** ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ అత్యవసర సర్వీసు(108)ల్లో ఈఎంటీ, పైలట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంటీ ఉద్యోగానికి సైన్స్ గ్రూపులో డిగ్రీ(డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ(పీసీబీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ ఎంబీ ఫార్మా, డి ఫార్మా, ఇతర పారా మెడికల్ కోర్సు) చదివి ఉండాలని, పైలట్ పోస్టుకు పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. ఈ నెల 6న మంచిర్యాలలోని 108 జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### జీవ వైవిధ్య మండలి సమావేశం

**కోటపల్లి:** మండలంలోని రాంపూర్ గ్రామంలో శనివారం రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించి పలు అంశాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర జీవ వైవిధ్య మండలి, స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ సంయుక్తంగా ప్రజా జీవ వైవిధ్యం రిజిష్టర్ తయారీకి సమాచారం సేకరించారు. టెక్నికల్ సపోర్టు గ్రూప్ గ్రామంలోని సహజ వనరులు, పంటలు, నాటు వైద్యుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహేశ్, సరిత, సంధ్య, జావిద్, రాజన్న, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డీలర్లకూ వేలిముద్ర



మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింటు



బియ్యం బస్తాలు

- ఎంఎల్‌ఎస్ పాయింట్లలోనూ ఈ–పాస్ అమలు
- నెలవారీ కోటా పంపిణీకి కొత్త నిబంధన
- ప్రతిసారీ వెళ్లాలంటే కష్టమంటున్న డీలర్లు

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** రేషన్ డీలర్లు నెలవారీ కోటా బియ్యం పొందాలంటే తమ వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు లబ్ధిదారులు ఈ–పాస్ మిషన్‌తో వేలిముద్ర వేస్తే బియ్యం తూకం సరిపడా వచ్చాక రశీదు వస్తోంది. తూకంలో తేడా ఉంటే రశీదు రాదు. దీంతో లబ్ధిదారులకు పారదర్శకంగా బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇదే తరహాలో డీలర్లకు సైతం గోదాముల నుంచి నుంచి పారదర్శకంగా బియ్యం సరఫరా చేయనుంది. తమకు నెలవారీగా బియ్యం కోటా పంపాల్సిన వాటి కంటే తక్కువగా బియ్యం వస్తున్నాయనే ఫిర్యాదులపై పౌరసరఫరాల శాఖ ఈ–పాస్ అమలు చేయనుంది. ఈ మేరకు ఈ నెల నుంచే డీలర్లు వేలిముద్ర వేస్తేనే ఎంఎల్‌ఎస్ పాయింట్ల(మండల స్థాయి గోదాం) నుంచి బియ్యం పంపిణీ కానుంది. రెండు రోజుల క్రితమే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ–పాస్ మిషన్‌తో లబ్ధిదారులకు బియ్యం వేలిముద్రల ఆధారంగా బయోమెట్రిక్ పద్ధతిలో ఇచ్చినట్లుగానే డీలర్లకు అందించే కోటా వేలిముద్రలతో పంపిణీ జరగనుంది. ప్రస్తుతం డీలర్లకు నెలవారీ కోటా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ బియ్యం పంపిస్తున్నారు. ఒక్క విద్యాశాఖ, సంక్షేమ హాస్టళ్లకు పంపిణీ చేసే బియ్యానికి మాత్రం సంబంధిత అధికారుల వేలిముద్రలు తీసుకుంటున్నారు. ఇదే తీరుగా డీలర్లకు సైతం వేలిముద్రతోనే నెలవారీగా కోటా సరఫరా చేయాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో వీటికి సంబంధించి అన్ని గోదాముల్లో అప్‌డేషన్ జరుగుతోంది.

**అక్రమాలకు చెక్ పెట్టేందుకు..**
ప్రజాపంపిణీ విభాగంలో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు ఉన్నాయి. వీటికి చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం ఈ నిబంధనలు తెచ్చింది. డీలర్లు సైతం తమకు పంపాల్సిన కోటా కంటే తక్కువగా బియ్యం పంపుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తెస్తున్నారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లోనూ ఎంఎల్‌ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వల్లో తేడాలు బయటపడుతున్నాయి. వీటన్నింటిని చెక్ పెట్టేందుకు గోదాంల్లోనూ ఈ–పాస్ మిషన్ అమలు చేయనున్నారు. ఇటీవల మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వల్లో తేడాలు రావడం, ఇన్చార్జి అధికారిపై సస్పెన్షన్ వేటు వేసింది తెలిసిందే. ఒక్కోసారి స్టేజ్–1 నుంచి లారీల్లో వచ్చిన బియ్యం నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్లలో దించకుండానే స్టేజ్–2 లారీల్లోకి లోడింగ్ చేస్తున్నారు. తూకం వేయకుండానే బియ్యం బస్తాలు పంపిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రజాపంపిణీలో మరింత పారదర్శకత తెచ్చేందుకు రేషన్ డీలర్లకు సైతం ఈ–పాస్ ప్రవేశపెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

**జిల్లాలో**

| | |
|---|---|
| రేషన్ దుకాణాలు | 423 |
| కార్డులు | 2.19లక్షలు |
| లబ్ధిదారులు | 6.43లక్షలు |

బియ్యం కేటాయింపు(జనవరి కోటా): 3524 మెట్రిక్ టన్నులు

### డీలర్ల అయిష్టత

ప్రతీనెల మండల స్థాయి గోదాముకు వచ్చి వేలిముద్రలు వేయాలంటే కచ్చితంగా డీలర్లు మాత్రమే రావాల్సి ఉంటుంది. వేరే వ్యక్తులకు పంపిణీ చేయ డం కుదరదు. జిల్లాలో లక్సెట్టిపేట, మంచిర్యాల, తాండూరు, బెల్లంపల్లి, కోటపల్లి, చెన్నూరు ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచే 423 రేషన్‌షాపులకు ప్రతీ నెల బియ్యం సరఫరా అవుతున్నాయి. స్టేజ్–1 గోదాం నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు అటు నుంచి డీలర్లకు పంపుతుంటే చివరకు లబ్ధిదారులకు అందుతున్నాయి. మారుమూల గ్రామాల నుంచి ప్రతి నెలా వేలిముద్రల కోసం ఎంఎల్‌ఎస్ పాయింట్లకు రావాలంటే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఇక కొన్ని చోట్ల రెండు, మూడు షాపులు ఒక్కరి పేరుతోనే ఇన్చార్జీలుగా కొ నసాగుతున్నారు. కొందరు స్థానికంగా ఉండకుండా వేరే వ్యక్తులతో నడిపిస్తున్నారు. తమ బంధువులు నడిపిస్తున్నారు. ఈ క్రమంలో వేలిముద్ర ప్రవేశపెడితే తమకు ఇబ్బంది అవుతుందని డీలర్లు అంటున్నారు.

### చివరి ఆయకట్టు వరకు సాగునీరు

- కలెక్టర్ బాదావత్ సంతోష్



కలెక్టర్ సంతోష్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న వ్యవసాయ భూములకు చివరి ఆయక ట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో నీటి పారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ ఎత్తిపోతల పథకం కింద 10 టీఎంసీల సాగునీటిని 90 వేల ఎకరాలకు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం రూ.1658 కోట్లతో జీవో ఆర్‌టీ నంబరు 133 కింద పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, పంపులు, పరికరాల విశ్లేషణ, పైప్‌లైన్, అనుసంధాన ఛానల్ సంబంధిత అనుమతులు జారీ చేసిందని అన్నారు. లిఫ్ట్–1 ద్వారా మందమర్రి మండల పొన్నారం, శంకర్‌పల్లి, జైపూర్ మండలం గంగిపల్లి ట్యాంక్‌ల వరకు నీటి విడుదలకు ప్రతిపాదించామని, లిఫ్ట్–2 ద్వారా భీమారం మండలం ఆరెపల్లి, చెన్నూర్ మండలం అస్నాద్, రెడ్డిపల్లి ట్యాంక్‌ల వరకు, లిఫ్ట్–3 ద్వారా కోటపల్లి మండలం శంకర్‌పూర్ ట్యాంక్‌లకు నీటిని విడుదలకు ప్రతిపాదించామని తెలిపారు. భీమారం మండలంలో 10,606, జైపూర్‌లో 19,987, మందమర్రిలో 5,435 ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. జిల్లా నీటి పారుదల శాఖ అధికారి శ్రావణ్, ఈఈలు స్వామి, రాము ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

**పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**
**మంచిర్యాలఅగ్రికల్చర్:** మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి సప్దర్ అలీఖాన్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, అదనపు గదులు, ప్రహరీ, వంటశాల, భోజనశాల, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ పనులు పూర్తి చేయాలన్నారు. 36 ఆదర్శ పాఠశాలల్లో పెయిటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు, డెస్కుల పంపిణీపై దృష్టి సారించాలని తెలిపారు.




జూనియర్స్‌లో చాంపియన్‌గా నిలిచిన మంచిర్యాల ఎస్సార్‌ఆర్ జూనియర్ కళాశాల జట్టు

### ఎస్‌పీఎల్ చాంపియన్స్ ఎస్సార్‌ఆర్, వాగ్దేవి

**కరీంనగర్‌స్పోర్ట్స్:** సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 శనివారంతో అట్టహాసంగా ముగిసింది. సీనియర్స్ విజేతగా మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కాలేజీ, జూనియర్స్ విజేతగా మంచిర్యాల ఎస్సార్‌ఆర్ జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. – వివరాలు 8లో..




సీనియర్స్ విన్నర్ జట్టు మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల

### వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న డీటీఓ, ఎంవీఐ

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో శనివారం వాహనాల వేలం నిర్వహించారు. పలు కేసుల్లో పట్టుకున్న వాహనాలు కార్యాలయ ఆవరణలో తప్పుపడుతున్నాయి. రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ(డీటీఓ) అధికారి ఎల్.కిష్టయ్య, సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వివేకానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల బహిరంగ వేలం నిర్వహించారు. ట్రాక్టర్, ఆటోలు, కారు తదితర వాహనాలు 15 వేలం వేయగా రూ.1.89 లక్షల ఆదాయం సమకూరింది.

### స్టడీసర్కిల్ ఏర్పాటుకు వినతి

**పాతమంచిర్యాల:** మంచిర్యాలలో అంబేద్కర్ స్టడీ సర్కిల్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి శనివారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు.

## పైపులైన్ మార్చడంలో జాప్యమెందుకు..?

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్
- గూడెం ఎత్తిపోతల పైపులైన్ పరిశీలన



మాట్లాడుతున్న వివేక్

**దండేపల్లి:** గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతోందని, కొత్త పైపులైన్ వేసేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్‌వెంకటస్వామి ప్రశ్నించారు. శనివారం ఆయన దండేపల్లి మండలం రంగంపల్లె సమీపంలో పగిలిన గూడెం ఎత్తిపోతల పైపులైన్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరా నిలిచి దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు బత్తుల శేఖర్, బందెల రవిగౌడ్, గాదె శ్రీనివాస్, తోడేటి హరికృష్ణ, దుమ్మని సత్తయ్య, గుండ ప్రభాకర్, కారుకూరి మధుకర్, హరి గోపాల్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంలో విఫలం

**బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్:** ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. శనివారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని గంగారంనగర్‌లో పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల్లి రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మునిమంద రమేష్, అందుగుల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, ఉపాధ్యక్షుడు హరీష్‌గౌడ్, కార్యదర్శులు రజిని, గోవర్ధన్, అసెంబ్లీ ఇంచార్జి సుదర్శన్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ పాల్గొన్నారు.

## ప్రజావాణి మారేనా..?

- మండలాల్లో గ్రీవెన్స్‌తో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- కలెక్టరేట్ బాట పడుతున్న గ్రామీణులు
- కొత్త కలెక్టర్ రాకతోనైనా కలెక్టరేట్‌లో నిర్వహించేనా..!



కలెక్టరేట్‌లో కలెక్టర్ కోసం వేచి చూస్తున్న అర్జీదారులు(ఫైల్)

**మంచిర్యాలఅగ్రికల్చర్:** మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో అర్జీదారులూ అటువైపు వెళ్లడం లేదు. కొన్ని మండలాల్లో అర్జీదారులు కూడా రాకపోవడంతో కార్యక్రమం వెలవెలబోతోంది. భూ సమస్యలు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు, విద్యుత్, రోడ్లు, నీటి సమస్య, పంట నష్టం, ఇళ్ల సమస్య తదితర వాటిపై ప్రతీ సోమవారం ప్రజలు జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు తరలి వస్తున్నారు.

**జిల్లాలో మాత్రమే మండల కేంద్రాల్లో..**
కలెక్టర్‌కు బాధ చెప్పుకుంటే వెంటనే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి తరలి వస్తుంటారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో ప్రజలు వందల కిలోమీటర్ల దూరం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రజావాణిలో సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేవారు. జిల్లాల ఆవిర్భావంతో 2016అక్టోబర్ నుంచి ప్రతీ సోమవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దూరభారం తగ్గడం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే సమస్యల పరిష్కారం లభించడంతో పెద్దయెత్తున ఆయా గ్రామాల నుంచి తరలివచ్చారు. వందల సంఖ్యలో అర్జీలు వచ్చేవి. 2018లో కలెక్టర్ భారతిహోళ్లికేరి వచ్చిన తర్వాత సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు నిర్వహించారు. అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రజావాణి రద్దు చేశారు. ఆ తర్వాత కొనసాగించగా.. 2021కరోనా ఉధృతి నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించలేదు. కొన్ని నెలల తర్వాత మొన్నటివరకు పని చేసిన కలెక్టర్ భారతిహోళ్లికేరి ఆదేశాలతో ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు.

**అక్కడ పరిష్కారం లేకనే ఇక్కడికి..**
స్థానికంగా ప్రజావాణి నిర్వహిస్తున్నా సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ప్రజలు విముఖత చూపుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌కే వస్తున్నారు. ఇతర జిల్లాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోనే నిర్వహిస్తుండగా జిల్లాలో మాత్రం మండల కేంద్రాల్లో కొనసాగుతోంది. సమస్యలకు పరిష్కారం లభించడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. గతంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేవారు. ఆయా శాఖల అధికారులు ఒకే చోట ఉండడం వల్ల అప్పటికప్పుడు కొన్ని సమస్యలకు పరిష్కారం లభించేది. అదే ఆశతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసి కలెక్టర్ చాంబర్‌లో అర్జీలు సమర్పిస్తున్నారు. కొత్త కలెక్టర్ బాదావత్ సంతోష్ రాకతోనైనా కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహణ ఉంటుందని, సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### కలెక్టర్‌కు చెప్పుకుంటే పరిష్కారం



మా గ్రామ శివారు సర్వేనంబరు 155/అ 12 గుంటల భూమి ఉన్నది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నాం. కొత్తగా వచ్చిన పాస్‌పుస్తకంలో ఎక్కలేదు. మా కులం పెరక (బీసీ–బీ) కాగా ఎస్సీ అని పాసుపుస్తకంలో నమోదు చేశారు. మండల ఆఫీసులో ఎన్ని సార్లు దరఖాస్తు పెట్టుకున్నా చేస్తలేరు. కలెక్టర్ ఆఫీసులో చెప్పుకుంటేనైనా అవుతుందని వచ్చిన. ప్రజావాణి లేదు ఫిర్యాదు చేసుడెట్ల.

– బేర రాజేశ్వరి, గ్రామం: వెల్గనూర్, మం: దండేపల్లి

### పింఛన్ కోసం తిరుగుతున్నాం..



నా భార్య లక్ష్మికి పదేళ్ల నుంచి చెవులు వినిపించవు. 2014 ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చూపించుకోగా వినికిడి లోపం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి 2020 జూన్ వరకు వికలాంగుల పింఛన్ వచ్చింది. రెండేళ్లుగా పింఛన్ రావడం లేదు. మున్సిపల్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేశాం. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తేనైనా సమస్య పరిష్కారం అవుతుందని వచ్చినాం. ఇప్పటికైనా ప్రజావాణి నిర్వహించాలి.

– కదం లక్ష్మి, నర్సయ్య, మందమర్రి

### పింఛన్ కోసం వచ్చిన



నా భర్త చనిపోయాడు. ఊరి చివర మామిడి తోటలో గుడిసె వేసుకుని ఉంటున్న. నా ఇద్దరు కొడుకులు బాపు, నీలయ్య తిండి పెట్టడం లేదు. నా భర్త బతికి ఉండగానే మా పేరు మీద ఉన్న భూములు మొత్తం వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నాకు వృద్ధాప్య పింఛన్ కూడా రావడం లేదు. చేతి కర్ర లేనిది నడువలేను. పింఛన్ కోసం కలెక్టర్ ఆఫీసుకు వచ్చిన ప్రజావాణి లేదు.. కలెక్టర్ లేడంటున్నారు.

– గోస్కుల చంద్రక్క, కన్నెపెల్లి

### మండలంలో పరిష్కారం కాలేదు



నాకు మా తాతల నుంచి వచ్చిన భూమి మా గ్రామ శివారు సర్వే నెంబర్ 132లో 5 గుంటలు ఉంది. పాత పాసుపుస్తకంలో ఉంది. కొత్తగా వచ్చిన దాంట్లో భూమి లేదు. తహసీల్దార్ ఆఫీస్‌లో ఇప్పటికి 30 నుంచి 40 సార్లు దరఖాస్తు చేసినా. తహసీల్దార్లు మారుతున్న కొద్దీ దరఖాస్తు ఇచ్చిన. నా భూమి పాస్ పుస్తకంలో ఎక్కలేదు. కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటేనైనా న్యాయం జరుగుతుందని వస్తున్నాం.

– చుంచు భీమయ్య, గ్రామం: వెల్గనూర్, మం: దండేపల్లి

## క్లుప్తంగా

### వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాత మంచిర్యాల: ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కలెక్టరేట్‌లో ఏవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు రంగంలో 20 లక్షల మంది పని చేస్తున్నారని, వారికి ప్రభుత్వపరంగా ఎలాంటి సంక్షేమ పథకాలు లేవన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 2019 మోటార్ వెహికిల్ యాక్టు సవరించాలని, జిల్లా కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద ఆటోఅడ్డా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సుధీర్, సతీశ్, హరీశ్, అరవింద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ పాల్గొన్నారు .

### దివ్యాంగులకు భరోసానిద్దాం



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

వేమనపల్లి(బెల్లంపల్లి): దివ్యాంగులకు భవిత కేంద్రం ద్వారా భరోసా ఇద్దామని జిల్లా సెక్టోరల్ అధికారులు కమ్మ చౌదరి, పద్మజ అన్నారు. నీల్వాయిలోని ఎంపీపీఎస్ పాఠశాల వద్ద ఉన్న భవిత కేంద్రంలో ఎంఈఓ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. సదరన్ క్యాంపు నుంచి జారీ చేయబడ్డ దివ్యాంగ సర్టిపికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కోటపల్లి మండలం తీన్నారం గ్రామానికి చెందిన డాక్టర్ అంబాల రాజేశ్ దివ్యాంగ చిన్నారులకు టిఫిన్ బాక్స్‌లు, పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, బుక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం స్రవంతి, సీఆర్పీ వెంకటేశ్ పాల్గొన్నారు.

### డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన లారీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో శనివారం ఓ లారీ అదుపుతప్పి డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. నీటి ట్యాంక్ సమీపంలో సిమెంట్ రోడ్డుపై మిషన్ భగీరథ పనులు చేపడుతుండగా మట్టి కుప్పలను తప్పించబోయిన లారీ పక్కనే ఉన్న డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది.

### 21 మందిపై పిచ్చికుక్కల దాడి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ఏరియా, రిక్షా కాలనీల్లో శనివారం 21 మందిపై పిచ్చికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. కాలనీకి చెందిన శ్రీధర్ రెడ్డి, ఇర్ఫాన్, లతీఫ్, ఇమానియల్, మహీర్, మల్లేశ్, హన్మంతు, పోశం, కనకమ్మ, నౌగంబస్తీ నివాసులు నలుగురితో పాటు కౌటాలకు చెందిన నవీన్, గాంధీనగర్ వాసులు లక్ష్మీ, గౌతం, వినోద్, సతీశ్‌లపై పిచ్చి కుక్కలు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు.

# జోరుగా... హుషారుగా



మల్యాల వాచ్‌టవర్ ఎక్కుతున్న బర్డ్‌వాచర్లు

- జన్నారం రేంజ్‌లో బర్డ్‌వాక్
- హాజరైనా 51 మంది బర్డ్‌వాచర్లు
- తొలిరోజు బైసన్‌కుంటలో పర్యటన

జన్నారం(ఖానాపూర్): జన్నారం అటవీ డివిజన్‌లో పక్షులకోసం చేపట్టిన నడక జోరుగా హుషారుగా సాగింది. బర్డ్‌వాక్ గురించి అటవీశాఖ ప్రకటించడంతో ఢిల్లీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, తదితర జిల్లాల నుంచి పక్షి ప్రేమికులు తరలివచ్చారు. వీరితో పాటు ఫారెస్ట్ కళాశాల రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) నుంచి 15 మంది విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కలిపి మొత్తం 51 మంది బర్డ్ వాక్‌కు తరలివచ్చారు. వారిని మధ్యాహ్నం భోజనం అనంతరం



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్‌వాచర్లు

మల్యాల వాచ్‌టవర్, అక్కడి నుంచి బైసన్‌కుంటకు తీసుకెళ్లారు. అక్కడ కుంటలో వివిధ రకాల పక్షులు ఉండటంతో వాటిని తమ కెమెరాల్లో బంధించారు. ఆదివారం తెల్లవారు జామున మైసమ్మ కుంట, ఘనిషెట్టి, కుంటాల ప్రాంతాల్లో బర్డ్‌వాక్ చేయనున్నట్లు ఎఫ్‌డీవో మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా పక్షి ప్రేమికులు 'సాక్షి'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం



బర్డ్‌వాక్ కోసం వివిధ ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు వచ్చారు. వారికి అన్ని ఏర్పాట్లు చేశాం. అడవిలో డేరాలు వేశాం. అక్కడే బస చేసేలా ఏర్పాట్లు చేశాం. భోజనం, టిఫిన్స్, నీటి వసతి కల్పించాం. వారిని అడవిలోకి తీసుకెళ్లడానికి వాహనాలు సమకూర్చాం. అందరు హుషారుగా బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు.

– సిరిపురం మాధవరావు, ఎఫ్‌డీవో

### చాలా పక్షులను గుర్తించా



జన్నారం అడవులు చాల బాగున్నాయి. మొదటిరోజు అడవులను తింపారు. బైసన్ కుంట వద్ద అనేక రకాల పక్షులు కనిపించాయి. వీటిని మా కెమెరాల్లో బంధించాం. వివిధ రకాల పక్షుల ఫొటోలు సేకరించి, వాటి గురించి తెలుసుకోవడం నా హాబీ. నాతో పాటు నా భార్య, కుమారుడు కూడా వచ్చారు.

– జయదీప్, హైదరాబాద్

### ఏర్పాట్లు బాగా చేశారు



బర్డ్‌వాక్ ఉందని తెలుసుకుని ఇక్కడికి వచ్చా. ఇక్కడికి రావడం మొదటిసారి. అధికారులు ఏర్పాట్లు బాగున్నాయి. జన్నారం అడవుల్లో పక్షులతో పాటు వన్యప్రాణులను గుర్తించాం. వాటిని కెమెరాల్లో బంధించాం. వాచ్‌టవర్, బైసన్ కుంటలకు తీసుకెళ్లారు. వివిధ రకాల పక్షులను గుర్తించి వాటి ఫొటోలు సేకరించాం.

– మహేందర్, హైదరాబాద్

### నాలుగోసారి వచ్చా



పక్షులంటే నాకు చాలా ఇష్టం. వివిధ రకాల పక్షుల గురించి తెలుసుకోవడం నా హాబీ. ఇందుకోసం పలుచోట్లకు వెళ్లా. బర్డ్‌వాక్‌కు రావడం ఇది నాలుగోసారి. 200 రకాల పక్షులను గుర్తించి వాటి పేర్లు చెబుతా. ఇప్పటివరకు జన్నారం, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్ డివిజన్, తదితర ప్రాంతాలకు వెళ్లి పక్షులను కెమెరాలో బంధించా.

– లింగంపల్లి కృష్ణ, పక్షి ప్రేమికుడు

## అంతర్‌జిల్లా పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికైన క్రీడాకారులతో సర్పంచ్ సుమలత

రెబ్బెన(ఆసిఫాబాద్): నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో జరుగనున్న అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని గోలేటి సర్పంచ్ పోటు సుమలత అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్ లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు**

ఎంపికైన క్రీడాకారుల జాబితాను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ప్రకటించారు. బాలుర జట్టుకు అక్షయ్, గోపాల శ్రీకృష్ణ, సిద్ధార్థ, ప్రేందీప్, రుద్ర ధృవన్, వరుణ్‌కుమార్, నిఖిల్, నాగ ఈశ్వర్ అజ్మీర ప్రభాస్, వెంకటసాయి నాథ్‌రెడ్డి, నాగరాజు, కోచ్‌గా తిరుపతి, మేనేజర్‌గా కే.నవీన్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో కాల్వ హరిణి, శ్రీ స్ఫూర్తి కారుణ్య, ప్రజ్వల, సాయి శ్రీవర్షిణి, శ్రావ్య, శ్రీవల్లి, అఖిల, శ్రీలేఖిత, విష్ణుప్రియ, సిరిచందన, మేనేజర్‌గా లావణ్య, కోచ్‌గా గోపాల్ ఎంపికయ్యారు.

## రాబోయే తరాలకు అటవీసంపద అందించాలి

- అటవీ రేంజ్ అధికారి శివజ్యోతి
- ముల్కల్లలో పర్యటించిన శిక్షణ బీట్ అధికారులు



అవగాహన కల్పిస్తున్న శివజ్యోతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే తరాలకు అటవీ సంపద అందించేలా సమష్టిగా కృషి చేయాలని అటవీ రేంజ్ అధికారి శివజ్యోతి అన్నారు. శనివారం హాజీపూర్ మండలంలోని ముల్కల్ల అటవీ రేంజ్ పరిధిలో దూలపల్లి అకాడమీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 32వ బ్యాచ్‌కు చెందిన 39 మంది శిక్షణ బీట్ అధికారులు అటవీ క్షేత్రంలో విస్తృతంగా పర్యటించారు. అంతకు ముందు జిల్లాలోని కవ్వాల్ అభయారణ్యంలోని జీవ వైవిధ్యం, చిరుత, ఇండియన్ గార్, నీల్గాయిల ఆవాసాలు, జలపాతాలు, ఫ్లోరా, ఫానా అరుదైన జాతి మొక్కలపై అవగాహన కల్పించారు. శిక్షణ బీట్ అధికారులు దాదాపు రెండు గంటల పాటు 659, 660 కంపార్ట్‌మెంట్, పాతమంచిర్యాల, ముల్కల్ల అటవీ సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతాలను, ర్యాలీ అటవీ ప్రాంతాన్ని కలియ తిరిగారు.

## కోలిండియా పోటీలకు కీడాకారుల ఎంపిక

నస్పూర్(మంచిర్యాల): కోలిండియా స్థాయి హాకీ పోటీలకు శ్రీరాంపూర్ ఏరియా నుంచి నలుగురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్అండ్‌పీసీలో విధులు నిర్వర్తిస్తున్న ఈ.సదయ్య, ఐకే 1ఏలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న బి.తిరుపతి, ఈపీ ఆపరేటర్ టి.సురేశ్, ఎస్సార్పీ ఓసీలో పనిచేస్తున్న ఎంవీ డ్రైవర్ జి.శ్రీకాంత్ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 10 వరకు జార్ఖండ్‌లోని షోహగ్‌పూర్‌లో నిర్వహించే పోటీలలో సదరు కార్మికులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

## సింగరేణి ఆస్తుల జాయింట్ సర్వే

నస్పూర్(మంచిర్యాల): నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి ఆస్తులను మున్సిపల్, సింగరేణి అధికారులు కలిసి శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ అప్పటి గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీకి సింగరేణి ఆస్తి పన్ను ఏడాదికి రూ.50 లక్షలు చెల్లిస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం సింగరేణి ఆస్తి పన్ను రూ.3 కోట్ల 71 లక్షల వరకు పెరిగిందన్నారు. పెరిగిన ఆస్తిపన్నును త్వరగా మున్సిపాలిటీకి చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆర్ఓ సతీశ్, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు పత్తి, వరి ధాన్యం దగ్ధం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లిలో శనివారం రాత్రి పెర్క సంతోశ్‌కు చెందిన పత్తి, వరిధాన్యం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. సంతోశ్ తన చేనులో నుంచి సేకరించిన వంద క్వింటాళ్ల పత్తి, 20 క్వింటాళ్ల వరిధాన్యం తన కొట్టంలో నిల్వ చేశాడు. ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించినా పూర్తిస్థాయిలో అదుపు కాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో రూ.8.40 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని స్థానిక సర్పంచ్ బొమ్మెల్ల పద్మ కిషన్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని బోరంపల్లిలో దుర్గం సమ్మక్కకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. శనివారం ఉదయం సదరు మహిళ ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో నుంచి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదంలో సుమారు రూ.40వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. వితంతువైన తాను తన పిల్లలను పోషించుకోవడానికే ఇబ్బంది పడుతుండగా ఉన్న ఇల్లు కూడా కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

# ఎస్‌పీఎల్ చాంపియన్స్ ఎస్సార్‌ార్, వాగ్దేవి

- రన్నరప్‌గా నిలిచిన జ్యోతిష్మతి, వివేకానంద జట్లు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్‌– 4
- విజేతలకు బహుమతులు అందించిన సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



జూనియర్స్ రన్నరప్ జ్యోతిష్మతి డిప్లొమా కాలేజీ, కరీంనగర్



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న వాగ్దేవి, వివేకానంద జట్లు



సీనియర్స్ రన్నర్ జట్టు వివేకానంద డిగ్రీకళాశాల, కరీంనగర్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆకాశాన్ని అంటే సిక్సర్లు.. కళ్లు చెదిరే ఫోర్లు.. అదిరిపోయే ఫీల్డింగ్.. ఆకట్టుకునే కవర్ డ్రైవ్‌లు.. హుక్‌షాట్లతో నాలుగురోజుల పాటు క్రికెట్ అభిమానులకు కనువిందుచేసిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 శనివారంతో అట్టహాసంగా ముగిసింది. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, రీజినల్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో 'సాక్షి' చేసిన ప్రయత్నం విజయవంతం అయ్యింది. తిమ్మాపూర్ జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానం కేరింతలతో ముంచెత్తిన క్రికెట్ సంబురం ముగిసింది.

**జూనియర్స్ ఫైనల్..**

మంచిర్యాల ఎస్సార్‌ార్ జూనియర్ కళాశాల, కరీంనగర్ జ్యోతిష్మతి డిప్లొమా కళాశాలల మధ్య ఫైనల్ పోరు జరిగింది. టాస్ గెలిచిన ఎస్సార్‌ార్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. 128పరుగుల భారీలక్ష్యంతో బరిలోకి దిగిన జ్యోతిష్మతి జట్టు నిర్ణీత 12ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 60పరుగులు చేసి ఓటమి పాలైంది. ఎస్సార్‌ార్ జట్టు 67పరుగుల భారీ స్కోర్ తేడాతో సీజన్–4 చాంపియన్స్‌గా నిలిచింది. ఎస్సార్‌ార్ జట్టులో వినయ్ హ్యాట్రిక్‌తో మొత్తంగా ఐదు వికెట్లు తీశాడు. హుద్రేయర్ 30 పరుగులు, సజన్ 27పరుగులు చేశారు.

**సీనియర్స్ ఫైనల్**

మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కాలేజీ, కరీంనగర్ వివేకానంద డిగ్రీ కళాశాలల మధ్య ఫైనల్ పోరు జరిగింది. టాస్ గెలిచిన వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 117పరుగుల భారీ స్కోరు చేసింది. 118 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వివేకానంద జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 85పరుగులు చేసి ఓటమి పాలైంది. వాగ్దేవి జట్టు 33పరుగుల భారీస్కోర్ తేడాతో సీజన్–4 సీనియర్ చాంపియన్స్‌గా నిలిచింది. జట్టులో వినయ్ 36, ఇస్మాయిల్ 32, సాయి 20పరుగులు చేసి ఆకట్టుకున్నారు. వివేకానంద జట్టులో భరత్ 2వికెట్లు తీశాడు.

| |
|---|
| జూనియర్స్ చాంపియన్ ఎస్సార్‌ార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల |
| జూనియర్ రన్నరప్ జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్ |
| సీనియర్స్ చాంపియన్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల |
| సీనియర్ రన్నరప్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ |

| |
|---|
| జూనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వినయ్ (ఎస్సార్‌ార్) |
| జూనియర్స్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ హుద్రేయర్ (ఎస్సార్‌ార్) |
| సీనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాయికృష్ణారెడ్డి (వాగ్దేవి) |
| సీనియర్స్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ భరత్ (వివేకానంద) |

**భవిష్యత్ క్రికెటర్లకు వేదికగా నిలిచిన ఎస్‌పీఎల్: ఎమ్మెల్యే రసమయి**

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, సాక్షి ప్రీమియర్ లీగ్ భవిష్యత్ క్రీడాకారులకు వేదికగా నిలిచిందని సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందించారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీలో క్రికెట్‌స్టేడియం నిర్మాణానికి రూ.25లక్షలు తన నిధుల నుంచి ఇస్తామని ప్రకటించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వి.ఆగంరావు మాట్లాడుతూ.. త్వరలో అన్ని జిల్లాకేంద్రాల్లో త్రీడే మ్యాచ్‌లు నిర్వహిస్తామని అన్నారు. 'సాక్షి' కరీంనగర్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌పీఎల్ సీజన్–4 విజయవంతానికి కృషి చేసిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్ పీవీసీ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్‌రఫీ, సర్పంచ్ రావుల రమేశ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, పుల్లమల్ల యాదగిరి, బత్తుల రాకేశ్, గోలి కిరణ్, బోనగిరి పరుషరాములు, బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు ఎంపికైన వారికి శ్రీనివాస్‌రావు నగదు బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.





### చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ఈ నెల 2న చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. పెద్దపల్లి మండలం జూలపల్లికి చెందిన గంగిపెల్లి మోహన్, నస్పూర్‌కు చెందిన మహ్మద్ ఆదిల్ ఈ నెల 2న తెల్లవారు జామున పంచముఖి ఆలయంలోని తలుపులు పగులగొట్టి విగ్రహానికి అలంకరించిన కిలో వెండి ఆభరణాలు దొంగిలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు కృష్ణకాంత్‌చార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరా పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. మంచిర్యాలలో ఆభరణాలు అమ్మేందుకు ప్రయత్నించగా శనివారం ఫ్లెటైవర్ వద్ద అరెస్టు చేశామన్నారు. ఎస్సై చంద్రకుమార్, పోలీస్ సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

### దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్ (57)పై గత నెల 26న ఐదుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ సత్తార్‌ను కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు. మంత్రాలు చేస్తున్నాడనే కారణంతో పాటు దర్గా సమీపంలోని ఓ స్థలం విషయంలో తలెత్తిన వివాదం కారణంగా పట్టణానికి చెందిన రవి, బుడిగె వంశీ, ప్రకాశ్, సాయి, వీరమల్ల రాజయ్య అతనిపై దాడికి పాల్పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### రైలు కిందపడి యువకుడు మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తు తెలియని రైలు కిందపడి 2వ జోన్‌కు చెందిన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు సబ్బని నిరంజన్ (33) మృతి చెందాడు. మృతుడి తల, శరీరం రెండు భాగాలుగా విడిపోయాయి. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఎవరైనా హత్య చేసి పట్టాలపై పడేశారా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడు ఓ యువతితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రేమ వ్యవహారమే మృతికి కారణమై ఉండవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జన్నారం(ఖానాపూర్): మండలంలోని టీజీపల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. సదరు వ్యక్తి శుక్రవారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. ఎవరైన గుర్తు పడితే 8712656547 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.